# అక్షరము – 2

ఏ కాలమునందుగాని, ఏ దేశమునందుగాని, ఏ భాషయందుగాని, మానవుడు పలికెడు అక్షరము యీ క్రింది ఐదు రకములలో ఏదో ఒక రకమునకు చెంది యుండును.

1. అచ్చులు : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ....... (Vowels)
2. హల్లులు : క, చ, ట, త, ప ....... (Consonants-Stops)
3. ఊష్మములు : శ, ష, స, హ ....... (Consonants-aspirants)
4. అంతఃస్థములు : య, ర, ల, వ ....... (Semi-Vowels)
5. అనునాసికములు : ఙ, ఞ, ణ, న, మ ....... (Nasal Sounds)

వేదము, మానవుడు పలుకగలిగిన యీ ప్రత్యేకమయిన ధ్వనికి పేరు పెట్టుటకు, రకమునకు ఒక ధ్వనిని ఏరి, ఐదు ధ్వనులతో మాటను కల్పించినది. మొదటి నాలుగుధ్వనులు వరుసగా **అ, క, ష, ర**. అనునాసికమునకు మాత్రము మొదటిదైన **ఙ**–ను కాక, చివరిదైన **మ**–ను తీసికొనినది. అచ్చుతో కూడిన **మ**–ను కాక, అచ్చులేని వట్టి హల్లు **మ్** తో మాటను పూర్తి చేసినది. అప్పుడు అకషరమ్ అవవలెను గదా! కాని, **క, ష,** లను కలిపి ఒకటే ధ్వనిని చేసి కూర్చిన మాట – **అక్షరమ్.**

మన నోటవెంట వచ్చు వట్టి అరుపులు, ఈ అక్షర ధ్వనుల వంటివి గావు. అరుపు వలన బాధ కాని, కోపముకాని ఉన్నట్లు తెలియవచ్చునుగాని, మనలోనున్న ఊహను తెలియపరచలేము. మన కోరికలనుగాని, మన జ్ఞానమును గాని, తెలియజెప్పలేము. దానికి అక్షరమే కావలెను. ఆ అక్షరమీ ఐదు రకములలో ఏదియో ఒకటి గావున, రకమున కొకటిగా ఏరి పేర్చి ఆ ప్రత్యేక ధ్వనిని తెలుపు మాటను తయారు చేసినది. ఆ మాట ఆ ధ్వని యొక్క స్వరూపము తెలుపుచున్నదిగదా! వేదమనేక విధములుగా మాటలను చేయును. వాటిలో ఇది ఒక పద్ధతి.

**మ్** చివరి ధ్వని. దానితో మన వాగ్యంత్రము మూతబడుచున్నది.కనుకనే **ఙ**–నుకాక, **మ్**–ను చేర్చినది. **మ్** వట్టి హల్లు. దానికి అచ్చు కలిపినచో మన వాగ్యంత్రము మూతబడదు. వర్ణమాల అంతమవదు. మన వాగ్యంత్రము **అ**–**మ్** ల మధ్యనున్న ధ్వనులను పలుకగలదని అక్షరమ్ అనిన మాట తెలుపుచున్నది. క, ష, లను వేరుగాక, కలిపి ఒక ధ్వనిని చేయుట వలన, మన నోటికి రెండు వేరైన అక్షర ధ్వనులను కలిపి ఒకటిగా పలుకగలిగిన శక్తి ఉన్నదని వేదము చెప్పుచున్నది.

తెలుగులోను, సంస్కృతములోను **క్ష** అన్న అక్షరమున్నదిగాని, వేదభాషలో లేదు. మానవుని నోటియందు అక్షరములను పలుకగలిగిన స్థానములు (చోట్లు) ఉన్నవి. ఆ చోటునుండి, ఆ అక్షరమే పుట్టును. క–, ష–లకు చోటులున్నవిగాని, క్ష–కు ప్రత్యేకమయిన చోటు లేదు. అందువలన వేదభాషాక్షరములందు **క్ష** లేదు.

వేదము మాటలను తయారుచేయు పద్ధతి ఈ విధముగానుండును. ఆ మాటను గురించి మనము ఆలోచించినచో, మనలను గురించి మనకు తెలియును. ఈ ఆలోచనను వేదము తపస్సు అనును. ఆలోచన మనస్సుతో కదా! వేద శబ్దమయిన **అక్షరమ్**–ను గురించి ఆలోచించినప్పుడు మన స్వరూపము తెలియుచున్నదిగదా! అందువలన వేదశబ్దములకు మన్త్రములని పేరు. మనస్సుద్వారా మన సంగతి మనకు తెలుపునది మన్త్రము. వేదశబ్దములన్నియు మన్త్రములే.

**అక్షరమ్**–ను గురించి ఎంతైనను ఆలోచింపవచ్చును. అనగా తపస్సు చేయవచ్చును. **అ**–కంఠమునందు పుట్టు చున్నది గదా! **క,ష,ర,మ్** ధ్వనులు పుట్టుచోట్లు దాని తరువాత క్రమముగా ఉన్నవి గదా! **మ్**–పెదిమెలమీద ఉన్నది. లోనున్న జ్ఞానమును బయటకు తెలియజెప్పునది అక్షరమని యీ వరుసల వలసన తెలియుచున్నది. వేదమీ విధముగా అక్షరములను పేర్చి, ఆ మాటలోనుంచి బయటకు వచ్చు దాని పేరా? లేక బయటనుండి లోపలకు పోవలసినదాని పేరా? – అను విషయము తేట తెల్లముగా చెప్పును. ఉదాహరణకు, **ఋషి** అన్న శబ్దమున్నది. **ఋ**– పలుకు చోటు నోటియందు పంటికి దగ్గరగా బయట ఉన్నది. **షి**–పలుకుటకు నాలుక లోనికి పోవలెను. కనుక ఋషి యనగా లోనికి చూచునది. అక్షరమెట్లు బయటకు వచ్చు శక్తియో, అట్లే ఋషిత్వము లోనికి చూచు మనము మాట–ను పలుకుటకు ప్రయత్నము చేయుచున్నాము. అనగా ఊహకు అనువైన మాటను వెతుకుచున్నాము. మాట స్ఫురించగానే, మన ప్రయత్నము లేకుండగనే, మాటలోని అక్షరములు ఒకటి తరువాత ఒకటిగా మనస్సు గడప దగ్గర వచ్చి నిలబడుచున్నవి. అనగా మాటల కొరకు తడబడవచ్చును, కాని అక్షరములకొరకు ప్రయత్నము లేదు. అప్రయత్నము గానే బయటకు వచ్చును.

మనకు రెండు విచిత్రమైన శక్తులున్నవి. ఒకటి ప్రాణము. అది ఉచ్ఛ్వాస, నిశ్వాసముల వలన జరుగు పని. రెండవది లోనున్న జ్ఞానమును ప్రకటింపగలుగుట. అది అక్షరములను పలుకగలుగుట వలన జరుగుచున్నది. ఈ రెండును మన చేతిలో లేవు. మనమా భాగ్యములతో పుట్టుచున్నాము. మనము మాటాడునప్పుడా ఉచ్ఛ్వాస, నిశ్వాసముల గాలియే కంఠనాళములద్వారా (larynx) అక్షరములను పలికించుచున్నది.లోనున్న గాలి ఒక్కటే గాలి, ప్రాణరూపమై ఉచ్ఛ్వాస, నిశ్వాసములు గాను, జ్ఞానరూపమై అక్షరములుగాను వెలికి వచ్చుచున్నది. గాలియనగా కదిలెడిదిగదా! ఆ కదలికకు చైతన్యమని పేరు. ఆ కదిలించు శక్తికి బ్రహ్మము అని పేరు. బ్రహ్మమే చైతన్యము, ప్రాణము, వాయువు, జ్ఞానము, అక్షరములను రూపములను పొందుచున్నది. కావుననే వేదము అక్షరమును బ్రహ్మమనుచున్నది.

వేదమునందున్న ప్రతిమాటయు ప్రతివాక్యము చాల అర్థముతో నుండును. దానిని గురించి ఆలోచించిన కొలది మనము ఎక్కువ తెలిసినవారమగుదుము.